# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ రోజు దీపావళి పర్వదినాన్ని దేశ వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.
2. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లోని జరిగే జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు పాల్గొంటారు.
3. తెలంగాణలో కుల గణన పర్యవేక్షణకు ప్రత్యేక పరిశీలకులను నియమించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
4. ఆంధ్రప్రదేశ్‌లో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
5. దీపావళి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

==========================

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ రోజు దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా ఆశ్వీయుజ బహుళ అమావాస్య రోజున ఈ పండుగ జరుపుకోవడం మనకు ఆనవాయితీగా వస్తోంది. నరకాసురుడు అనే రాక్షసుడిని శ్రీ కృష్ణ సమేత సత్యభామ వధించిన సందర్భాన్ని పురస్కరించుకుని దీపావళి పండుగ నిర్వహిస్తారని పురాణాలు పేర్కొంటున్నాయి.

--------------------------

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధన్ కడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్. అబ్దుల్ నజీర్, జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రులు ఎన్. చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

--------------------------

స్వతంత్ర భారత దేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంశాఖమంత్రి, ఉక్కు మనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్ల భాయ్ పటేల్ జయంతి ఈరోజు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 2014 నుండి

ప్రతి ఏటా అక్టోబర్ 31వ తేదీని రాష్ట్రీయ ఏక్తా దివస్.. జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తోంది.

1875 అక్టోబర్ 31వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని నాడియార్‌లో ఆయన జన్మించారు. వల్ల భాయ్ పటేల్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించారు. జునాఘడ్ భారత్‌లో అంతర్భాగమని ఆ మహనీయుడు ఒక సందర్భంలో ఉటంకిస్తూ...

..వాయిస్...7 సెకన్లు (పటేల్)

---------------------------

గుజరాత్‌లో పర్యటిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఏక్తానగర్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద జరిగే "జాతీయ ఐక్యతా దినోత్సవ "వేడుకల్లో పాల్గొని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులు అర్పించి 'ఏక్తా దివస్' ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొంటారు.

కాగా " రాష్ట్రీయ ఏక్తా దివస్"పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక చర్చా కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను దీపావళి కానుకగా లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో నిన్న ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 29 సెకన్లు )

---------------------------

తెలంగాణలో కుల గణన పర్యవేక్షణకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక పరిశీలకులను నియమించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కులగణనపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిన్న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే ప్రభుత్వ విధానమని అన్నారు.

---------------------------

దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ ఉద్యోగులకు 3.64 శాతం కరవు భత్యం-డీఏ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఏ పెంపు 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నామని పేర్కొంది. అలాగే 2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

బాణాసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఇప్పుడు విందాం.

వాయిస్ ( 36 సెకన్లు)

---------------------------

తెలంగాణలో గ్రూప్–3 పరీక్షకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్– టీజీపీఎస్సీ విడుదల చేసింది. నవంబర్ 17, 18 తేదీల్లో జరిగే ఈ పరీక్ష రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పేపర్ 1బీ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు పేపర్ –2 పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొంది. అలాగే, నవంబర్ 18న పేపర్ 3 పరీక్షను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహిస్తామని, నవంబర్ 10న హాల్ టికెట్లు అందుబాటులోకి తెస్తామని టీజీపీఎస్సీ తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడలో మెప్మా స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్ గురించి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ..

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

దీపావళి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 26 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కాచిగూడ - నిజాముద్దీన్, నాందేడ్ –పానిపట్, నాందేడ్ –పాట్నా, ఛాప్రా–యశ్వంత్‌పూర్, చెన్నై - అంబాలా కంటోన్మెంట్ మార్గాల్లో దీపావళి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని పేర్కొంది. ప్రత్యేక రైళ్లతో పాటుగా పలు ప్రధాన రైల్వే స్టేషన్లలో 14 అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

---------------------------

తెలంగాణలోని సంక్షేమ వసతి గృహాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆహార, కాస్మొటిక్ ఛార్జీలను పెంచింది. అన్ని రకాల గురుకులాలు, పలు శాఖలకు చెందిన అనుబంధ వసతి గృహాల్లో ఛార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 3 నుంచి 7వ తరగతి వరకు 950 రూపాయలుగా ఉన్న ఆహార ఛార్జీలను 13 వందల 30 రూపాయలకి, 8 నుంచి 10వ తరగతి వరకు 15 వందల 40 రూపాయలకి. ఇంటర్ నుంచి పీజీ వరకు 2 వేల వంద రూపాయలకు పెంచింది. అలాగే 3 నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి కాస్మోటిక్ ఛార్జీలను 175 పెంచగా, 8 నుంచి 10వ తరగతి వరకు 275 రూపాయలకు పెంచింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య కళాశాలకు ప్రఖ్యాత తెలుగు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును పెట్టాలని రాష్ట్ర ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ వైద్య ఆరోగ్య శాఖకు లేఖ రాశారు. ప్రపంచానికి పలు ఔషధాలు అందించిన శాస్త్రవేత్త యల్లాప్రగడ సబ్బారావు స్వస్థలం భీమవరం, చదువుకున్నది రాజమహేంద్రవరం అయినందున కొత్తగా ఏర్పడిన ఏలూరు, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఏదైనా ఒకదానికి ఆయన పేరు పెడితే సముచితంగా ఉంటుందని లేఖలో కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంబంధిత వివరాలను అందజేశారు .

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం-టిటిడి పాలక మండలి నూతన ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ఈ మేరకు టిటిడి అధికారిక ప్రకటన విడుదల చేసింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ, కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మడకశిర శాసన సభ్యులు ఎం.ఎస్ రాజు , కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మిలతో పాటు తెలంగాణ నుంచి ఐదుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షకు షెడ్యూల్ ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్-ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 5న, ఈ పరీక్షను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష మంది వరకు ఈ పరీక్ష రాసే అవకాశం ఉందని డీఎస్సీ, ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

======================